**కామెడీ కథ**

# అద్దెకి ఆడియన్స్

ఇలపావులూరి మురళీమోహనరావు

**ఆ రోజు ఆదివారం. ఉదయాన్నే మా ఇంటికొచ్చాడు మా బాబాయి ఖండవల్లి కామేశ్వరశర్మ. పేరు చెప్పగానే ఠక్కున గుర్తుకు రావడానికి ఆయనేమీ మొద్దు శీనో, కృషీబాంకు ఛైర్మనో కాదు కదా! ఆయనో కవి. లెక్చరర్‌గా రిటైర్ కాగానే వాజ్‌పేయి అన్నట్లు- అయామ్ రిటైర్డ్. బట్ నాట్ టైర్డ్ - అని గాంధీ, నెహ్రూలు స్వాతంత్ర్య సంగ్రామంలోకి దూకినట్లు సాహిత్య సమర రంగంలోకి దూకాడు.**

కుప్పలు తెప్పలుగా సునామీ అలల్లా కవితలు విరుచుకుపడ్డాయి. ఒక్కటీ ప్రచురణకు నోచుకోలేదు. దాంతో బాబాయికి మండి తన కవితలను తానే అచ్చేసి దేశం మీదికి వదిలాడు. మొన్న వచ్చిన వరదలకు వంతెనలు, పంటపొలాలు మునిగినట్లు ముప్పై వేలకు మునిగిపోయాడు. అయినా పిరికిరైతులా ఆత్మహత్యలకు పాల్పడలేదు. నిండా మునిగిన వాడికి చలేంటి అన్నట్లు మరో కవితా సంకలనాన్ని అచ్చేశాడు. సెంట్రల్ లైబ్రరీలో ఎల్లుండి ఆవిష్కరణ సభ పెట్టాడు. ఆ విషయమ్మై మాట్లాడటానికే వచ్చుంటాడు.

"ఎల్లుండేరా మీటింగు" అన్నాడు.

"అవును. చెప్పినట్లు గుర్తుంది" అన్నాను.

"ఆడియన్స్‌తో ప్రాబ్లెం వచ్చింది"

"వాళ్లకేం ప్రాబ్లెం?"

"వాళ్లకి కాదు. వాళ్లిద్దరూ రారనేది నా ప్రాబ్లెం"

"ఎంతమందిని పిలిచావు?"

"కనిపించిన ప్రతి గాడిదనూ పిలిచా"

"ఇంకేం మరి?"

"ఎవ్వరూ వచ్చేట్లు కనపడటంలా"

"ఏం?"

"టీవీ సీరియల్స్ మిస్సవుతామని ఆడాళ్ల భయం"

"అవి జీవితాంతం వస్తూనే ఉంటాయిగా"

"నిజమే. ఒక్క పూట మిస్సయినా జీవితంలో ఏదో అమూల్య సంపద పోయినంతగా బాధపడతారు"


"అదీ నిజమే. టీవీలో సినిమా వస్తుందా, సీరియల్ వస్తుందా అనేది వారికి ముఖ్యం కాదు. టీవీ చూడటమే ప్రధానం. మరి మగాళ్లకేం మాయరోగం?"

"వాళ్లకు బద్ధకం. రకరకాల వంకలు చెబుతున్నారు"

"మరేం చేద్దామనుకుంటున్నావ్?"

"అది కనుక్కుందామనే నీ దగ్గరికొచ్చా"

ఇంతలో సుందరి కాఫీ తెచ్చింది. తాగుతూ ఆలోచించాను.



"ఐడియా" అన్నాను.

"ఐడియానో, హచ్చ్, ఎయిర్‌టెల్లో..ఏదోటి టెల్లు"

"ఈమధ్య మ్యాన్ పవర్ సప్లై ఏజెన్సీస్ చాలా వెలిశాయి. మనకు ఎంతమంది కావాలంటే అంతమందిని సప్లై చేస్తారు"

నోరు తెరిచాడు బాబాయి. "హా.. ఇదేం విడ్డూరంరా? వస్తువులను సప్లై చేసినట్లు మనుషుల్ని కూడా సప్లై చేస్తారా?" అన్నాడు.

నవ్వాను. "కాదేదీ సప్లైకి అనర్హం అనేది నేటి సూక్తి. నాకు తెలిసిన ఒక ఏజెన్సీ ఉంది. వెళ్లి కలుద్దాం. ఇక నీ పుస్తకావిష్కరణకు బోలెడంత మంది జనం. సీట్లు అరేంజ్ చేయలేక నువ్వు ఇబ్బంది పడాలి" అన్నాను.

బాబాయి ముఖం వెలిగిపోయింది. వెంటనే నా స్కూటర్ మీద బయలుదేరాం. అరగంటలో 'జన పరం పర మ్యాన్ పవర్ రిసోర్సెస్ లిమిటెడ్' ఆఫీస్‌కు చేరాం. రిసెప్షన్లో కూర్చున్న అందమైన పిల్ల ఇకిలించి ఆహ్వానించింది. ఆ ఆఫీస్, అలంకరణ, ఫర్నిచర్ చూసి పిచ్చెక్కిపోయింది మాకు.

"వాట్ కెన్ ఐ డు ఫర్ యూ" అన్నది రిసెప్షనిస్టు. ఆ పిల్ల నోట్లో ఎన్ని దంతాలున్నాయో లెక్కపెట్టొచ్చు.

"ఇక్కడెవరో మనుషుల్ని సప్లై చేస్తార్ట. ఆ మేస్త్రీ ఎక్కడుంటాడు?" అడిగాడు బాబాయి.

అయోమయంగా చూసింది పిల్ల. "వాట్.. మేస్త్రీనా?" అంది.

"అబ్బా.. బాబాయ్.. అలాంటి మాటలు వీళ్లకు అర్థం కావు. అతడిని మేస్త్రీ అనకూడదు. మేనేజింగ్ డైరెక్టర్ అనాలి" అని "యమ్‌డీగారిని కలవాలి" అన్నాను పిల్లతో.

"ఐ సీ.. అప్పాయింట్‌మెంట్ ఉందా?" అంది పిల్ల.

"లేదు" అన్నాను.

"నో ప్రొబ్లెమ్..మీ పేరు రిజిస్టర్ చేయించుకుని త్రీ మంత్స్ తరువాత రండి" అన్నది పిల్ల కంప్యూటర్ ఆన్ చేసి.

"వాట్..ఆఫ్టర్ త్రీ మంత్స్?" అన్నాను ఆశ్చర్యంగా.

"యస్.. అప్పటి దాకా వారు బిజీ" నవ్వింది పిల్ల.

ఇహ బాబాయ్ ఆశ్చర్యానికి అంతే లేదు. "మైగాడ్.. ఏం కార్పొరేట్ కాలం? డాక్టర్లు బిజీ, యాక్టర్లు బిజీ, మంత్రులు బిజీ, అధికార్లు బిజీ. పనీ పాటా లేని వాళ్లం మనమేలా ఉన్నాం. సరె..పోదాం పద." అన్నాడు.

రెండు నిమిషాలైనా మాట్లాడే అవకాశం ఇప్పించండి అని బ్రతిమలాడకుండా మేం తిరుగుముఖం పట్టడంతో పిల్లకు కంగారు పుట్టింది. "వన్ మోమెంట్ ప్లీజ్" అన్నది. ఆగాము. ఇంటర్‌కమ్‌లో ఏదో మాట్లాడింది. ముఖమంతా నవ్వు పులుముకుని "ఈ టైమ్‌కు రావలసిన క్లైంట్స్ ఫ్లైట్ లేట్ కావడం వల్ల బాస్ ఫ్రీగా ఉన్నార్ట. మీరు నైన్టీ సెకన్స్ వారిని కలవచ్చు" అన్నది.

"థాంక్స్" అన్నాను.

ఇద్దరం యమ్‌డీ ఛాంబర్‌లోకి వెళ్లాం. చాలా ఆర్భాటంగా ఉంది ఆయన ఛేంబర్. ఫుల్ సూట్లో ఉన్నాడు.

"ప్లీజ్ కమిన్. అయామ్ నరసింహం." ఆహ్వానించాడు.

మా పరిచయాలు చేసుకున్నాం.

"అరేయ్.. తొంభై సెకండ్లయిపోయాయి" అన్నాడు బాబాయ్ నా చెవిలో.

"అన్నీ ఎచ్చులే.. వీడికంత సీన్ లేదులే..కూర్చో" అన్నాను బాబాయి చెవిలో.

"ఏదో అంటున్నారు" నవ్వాడు నరసింహం.

బాబాయి తమాయించుకుని "మీరు ఎలాంటి మనుషుల్ని సప్లై చేస్తారు?" అడిగాడు.

"ఎలాంటివాళ్లనైనా సరే.. సంవత్సరం వయసు నలుసు నుంచి నూరేళ్ల ముసలాడి వరకు. ఈవెంట్‌ను బట్టి మనుషుల్ని అరేంజ్ చేస్తాం. పెళ్లిళ్లయినా, పేరంటాలైనా, చావులైనా, ఖర్మలైనా పొలిటికల్ మీటింగులైనా, సాహిత్య సభలైనా, వారివారి అవసరాలకు తగ్గట్లు ఆడా మగా ఎవరినైనా సప్లై చేస్తాం. మొన్నామధ్య మాకూ ఓటు హక్కు కల్పించాలని అఖిల భారత కొజ్జాల సంఘం వారు నిర్వహించిన ఊరేగింపుకు వెయ్యిమందిని పంపించాం"

"ఆహా... అవునూ.. నాకు తెలియక అడుగుతున్నాను చావులకు మనుషులెందుకు?" అడిగాడు బాబాయి.

"ఏడవడానికి" నవ్వుతూ చెప్పాడు నరసింహం.

"ఎగతాళా?" కొంచెం సీరియస్‌గా అన్నాడు బాబాయి.

"నో..నో.. నిజంగానే. ఈ రోజుల్లో తల్లిదండ్రులు చచ్చిపోయినా వారి ఆస్తిపాస్తులు అనుభవించే పిల్లలు నలుగురి ముందూ నోరారా ఏడవడానికి నామోషీగా ఫీలవుతున్నారు. చనిపోయిన వారి ఆత్మ శాంతించడం కోసం ఏడవడానికి మనుషులు కావాలంటారు. మా వాళ్లెళ్లి గుండెలు పగిలేట్లు ఏడుస్తారు" పకపక నవ్వాడు నరసింహం.

మాటల మధ్య నాలుగైదు సార్లు ఫోన్ మోగటం, చాలా బిజీ అని నరసింహం చెప్పడం జరుగుతున్నది.

"మరి పెళ్లిళ్లకెందుకండీ బంధువులు ఎలాగూ వస్తారు కదా" అడిగాను.

"ఏరండీ? ఇవాళా రేపు పెళ్లి హైదరాబాద్‌లో అయితే రిసెప్షన్ బెంగుళూర్లో జరుగుతున్నది. పెళ్లి ఏదో ఫంక్షన్ హాల్లో, విందు ఫైవ్‌స్టార్ హోటల్లో. భోజనం దొరుకుతుందని అందరూ రిసెప్షన్‌కే వెళ్తారు పెళ్లి టైముకు పీటల మీద వధూవరులు, మంత్రాలు చదివేందుకు పురోహితుడు తప్ప ఎవరూ కూర్చోవడం లేదు. అటువంటి వాటికి మేము మా కాస్ట్యూమ్స్‌తో ఆడా మగాను సప్లై చేస్తాం. ఇంతకూ మీకేం కావాలి? పెళ్లా?" అడిగాడు నరసింహం.

"హబ్బే.. ఈ వయసులో నాకు పెళ్లేంటి?" అన్నాడు బాబాయి నవ్వి.

"అబ్బే.. నా ఉద్దేశ్యం అది కాదు. మీ ఇంట్లో ఏదైనా పెళ్లి కోసం జనం కావాలేమోనని" నసిగాడు నరసింహం.

"పెళ్లి కాదండీ.. సాహిత్య సభ.. పుస్తకావిష్కరణ. ఓ యాభై మంది ఆడియన్సు కావాలి."

"ఓహో.. ప్రస్తుతం వీటికే డిమాండ్ ఎక్కువ. మీకే టైపు ఆడియన్స్ కావాలి?"

"టైపేంటి?"

"వివరంగా చెబుతాను. వీటిలో మూడు రకాలు. మంచి వినికిడి శక్తి, ఓర్పు ఉన్నవారు మొదటి రకం. వక్తలు మాట్లాడేది శ్రద్ధగా వింటారు. ప్రతిస్పందనలిస్తుంటారు. రెండు గంటలకు మనిషికి వంద రూపాయలు ఛార్జ్ చేస్తాం."

"ఆ.." నోరు తెరిచాడు బాబాయి.

"ఇక రెండో రకం. వీరికి బాగా చెవుడుంటుంది. ఆ రెండు గంటల పాటు చెవిటి మిషన్లు తీసేసి కూర్చుంటారు. అందువల్ల వక్తల వల్ల వారికేం అపకారం జరగదు. ఈ కేటగిరీకి మనిషికి డెబ్భై అయిదు రూపాయలు ఛార్జ్ చేస్తాం. వీరు మధ్య మధ్య నవ్వుతూ తలలు ఊపుతూ చప్పట్లు కొడుతూ యాక్షన్ చేస్తుంటారు" చెప్పాడు నరసింహం.

"ఇక మూడో రకం?" అన్నాను నేను ఉద్వేగాన్ని తట్టుకోలేక.

"మూడో రకం వారికి బ్రహ్మ చెవుడుంటుంది. చెవిటి మిషన్లను కర్ణభేరిలోకి దోపినా వీరికి శబ్దం వినిపించదు. పక్కనే పిడుగు పడ్డా చలించరు. వీరికి యాభై రూపాయలు ఛార్జ్ చేస్తాం"

"మరి వక్త ప్రసంగించగానే కరతాళ ధ్వనులు చెయ్యాలి కదా. వినిపించక పోతే చప్పట్లెలా?" సందేహం వెలిబుచ్చాను.

"మీకా భయం అవసరం లేదు. వారంతా ట్రైన్డ్ మ్యాన్ పవర్. వక్త మాట్లాడడం ఆపగానే కప్పు కూలిపోయేట్లు చప్పట్లు కొడతారు." అభయమిచ్చాడు నరసింహం.

షాకు మీద షాకు తింటున్నాడు బాబాయి. "కొంచెం రేట్లు తగ్గించగలరా?" అడిగేడు మహా దీనంగా.

"గుడ్డివాళ్లనైతే ముప్పై రూపాయలకే సప్లై చేస్తాం" అన్నాడు నరసింహం.

"గుడ్డివాళ్లకేమీ కనపడదు కదా" అన్నాను.

"కనపడదు కాబట్టే గుడ్డివాళ్లంటాం. వక్త ఉపన్యాసం ముగించగానే మీరెవరైనా చప్పట్లు కొడితే వారూ కొడతారు" వివరించాడు నరసింహం.

"అబ్బే.. బాగుండదు. మూగవాళ్లైనా ఫరవాలేదు కానీ గుడ్డివాళ్లయితే మరీ అసహ్యంగా ఉంటుంది" అన్నాడు బాబాయి.

"అవును. బ్రహ్మచెవిటివాళ్లే మనకు బెస్ట్. వాళ్లు చూస్తున్నట్లుంటుంది. చప్పట్లు కొడుతుంటే మన ప్రయోజనం నెరవేరినట్లుంటుంది. ఆడియన్స్ చెవిటోళ్లో, మూగవాళ్లో అని వక్తలెవరూ చెక్ చెయ్యరు కదా?" సలహా ఇచ్చాను.

రెండు వేల రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి యాభై మందిని బుక్ చేసుకున్నారు.

"చూడండి మా వాళ్లు చెప్పిన టైమ్‌కు షార్ప్‌గా వస్తారు. కచ్చితంగా ఎనిమిది గంటల వరకే ఉంటారు. ఆ తరువాత వారిని జొన్నల పెదసత్యనారాయణగారి సంగీత సభకు పంపాలి. కాబట్టి మీటింగ్ లేటుగా మొదలైనా ముందే మొదలైనా మా బాధ్యత ఉండదు. ఆ జాగ్రత్తలో మీరుండాలి" హెచ్చరించాడు నరసింహం.

* * *

ఆవిష్కరణ సభకు కరెక్టుగా ఆరు గంటలకొచ్చారు ఏభై మంది చెవిటి వారు. వారికి మార్గదర్శనం చేస్తూ ఒక సూపర్‌వైజర్ కూడా. అందరూ బస్సు దిగి లోపలికొచ్చారు.

మీటింగ్ మొదలైంది. ఇద్దరు కవులు, ఇద్దరు ప్రొఫెసర్లు, ఇద్దరు వ్యాపారవేత్తలు, ఎవరూ పిలవకపోయినా సభలకొచ్చి నేరుగా వేదికెక్కే ఒక సంఖ్యా శాస్త్రవేత్త(ట!) వేదికనలంకరించారు.

అధ్యక్షుడు ప్రారంభోపన్యాసం చేస్తుండగా ఆయన సెల్‌ఫోన్ మోగింది. మాట్లాడిన ఆయన ముఖం వివర్ణమైంది. "ప్రఖ్యాత కవి డాక్టర్ దైవభూతంగారు మరణించారని వార్త వచ్చింది. వారి అకాల మరణానికి సంతాపం తెలుపుతున్నాను. ఆయనకు వక్తలంతా సంతాపం తెలిపాక కార్యక్రమాలు నిర్వహిద్దాం" అని కూర్చున్నాడు.

చప్పట్లతో హోరెత్తించారు ఆడియన్సు. బాబాయికి ముచ్చెమటలు పోశాయి. వక్తలు వింతగా చూశారు. మరో వక్త సంతాపసందేశం వినిపించి కూర్చోగానే మళ్లీ చప్పట్లు!

"వద్దు..వద్దు.." మెల్లగా అరిచాడు బాబాయి. ఏం లాభం? వారికి వినిపిస్తేగా?

నేను సూపర్‌వైజర్ని హెచ్చరించాను. "లాభం లేదండీ.. నాకున్నది ఒకటే గొంతు. మీ కోసం దాన్ని చించుకోలేను. మీరు చెవిటిమిషన్ల కేటగిరీని ఎంచుకోవాల్సింది" చేతులెత్తేశాడు సూపర్‌వైజర్.

అప్పుడు బాబాయ్ ముఖం చూడాలి!